సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 11 । జూన్ । 2023



కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్యం

ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని శనివారం ప్రాజెక్టు లేబర్ గేట్ సమీపంలోని రాజీవ్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. 8లో▸



బరువుకు భయపడరు

బిహార్ రాష్ట్రం నుంచి ఉపాధి వెతుక్కుంటూ వచ్చిన వలస కూలీలు వారు మోసే బరువుకు భయపడక, చెమట చిందిస్తూ నిరంతరం శ్రమిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
39.0/28.0

వాతావరణం

ఆకాశం ఉదయం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పెండింగ్ కేసుల్లో రాజీ పడడమే మంచిది



మాట్లాడుతున్న జిల్లా జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో కక్షిదారులు రాజీ పడడమే మంచిదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్ కుమార్ అన్నారు. జిల్లా న్యాయస్థానంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. లోక్‌అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవడం వల్ల సమయం, డబ్బులు ఆదా అవుతాయని గ్రహించాలన్నారు. పైగా లోక్‌అదాలత్ తీర్పుపై అప్పీలుకు వెళ్లేందుకు అవకాశముండదని వివరించారు. నిరుపేదలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయసేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి రాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, కిశోర్, సత్తయ్య, సంతోష్‌బాబ్జీ, హనుమాన్‌సింగ్, వాసు, రాధిక పాల్గొన్నారు.

గ్రూప్‌-1 పరీక్షలకు సర్వం సిద్ధం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఆదివారం నిర్వహిస్తున్న గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ సంగీత తెలిపారు. పెద్దపల్లిలో 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా రామగుండంలో 10, సుల్తానాబాద్‌లో 2, రామగిరిలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఆభరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్‌లు వెంట తీసుకురావద్దని సూచించారు. ఒరిజినల్ హాల్‌టికెట్టు, వ్యాలిడిటీ ఫొటో, ఐడీ గుర్తింపు తెచ్చుకోవాలని తెలిపారు.

నేడు సాహిత్య దినోత్సవం

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పెద్దపల్లి శివారు రంగంపల్లిలో సాహిత్య దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. కార్యక్రమంలో కవులు, రచయితలను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు.

మూడెకరాల భూమి ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: వ్యవసాయకూలీలుగా పనిచేస్తున్న నిరుపేదలకు మూడెకరాల భూమిని ఇవ్వాలని, పోడు భూములను ఎలాంటి షరతులు లేకుండా పంపిణీ చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు చలపతిరావు డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లిలో నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి హాజరై మాట్లాడారు. కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చి వడ్డీలేని పంట రుణాలు ఇవ్వాలన్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని తెలిపారు. కేంద్రంలోని మోదీ సర్కార్ రైతువ్యతిరేక చట్టాలను తెచ్చి రైతులను బానిసలుగా మార్చేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. నాయకులు చంద్రయ్య, రాజన్న, కృష్ణ, వెంకన్న, నరేశ్, సదానందం, మల్లేశ్, అశోక్, శంకర్, సాంబయ్య, రాజకొమురయ్య, లింగమూర్తి, తిరుపతి, బాలకృష్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

- వాహనదారులకు, పౌరులకు రోడ్డు భద్రతపై ప్రచారం, అవగాహన కల్పించే ఓ రవాణాశాఖ అధికారి విదేశాలకు వెళ్లినప్పుడు డ్రైవింగ్ చేశాడు. యూటర్న్ తీసుకుని అలవాటు ప్రకారం వాహనాన్ని ఎడమకు తిప్పారు. అది 150 కిలోమీటర్ల స్పీడ్ ఉన్న రోడ్డు అదృష్టం కొద్దీ ఎదురుగా ఏ వాహనం రాలేదు.
- ఇటీవల విదేశాల నుంచి ఇండియాకు వచ్చిన ఓ వాహనదారుడు విదేశాల అలవాటు ప్రకారం కరీంనగర్ రోడ్డుపై కుడివైపు నుంచి కారును నడిపి భారీ ప్రమాదానికి కారణమయ్యాడు.



సండే స్పెషల్

కుడి ఎడమైతే.. ప్రమాదమేనోయ్!

- ఇండియాలో కుడి, విదేశాల్లో ఎడమ డ్రైవింగ్
- పెరుగుతున్న అంతర్జాతీయ లైసెన్స్‌లు
- ఐటీ, విదేశీ విద్యతో అధికమవుతున్న డిమాండ్



కొత్తలో గందరగోళం

కొత్తలో డ్రైవింగ్ చేసేటప్పుడు సహజంగా కొంత భయం ఉన్నప్పటికీ సరిగానే నడపగలిగా. ఒకసారి నా కారు ఇంకో కారును తాకినప్పటికీ పెద్దగా నష్టం జరగలేదు. ఇండియాలో వాహనానికి కుడి పక్కన స్టీరింగ్ ఉంటే అమెరికాలో ఎడమ పక్కన స్టీరింగ్ ఉంటుంది. కొత్తగా అమెరికా వచ్చిన వారికి కొంత కన్ఫ్యూజన్ ఉంటుంది. ఇక్కడి నిబంధనల ప్రకారం ముందుగా ఆన్‌లైన్ టెస్ట్ అయ్యాక డ్రైవింగ్ టెస్ట్ కోసం రోడ్డుపై వాహనం నడపాల్సి ఉంటుంది. సరిగా నడుపుతున్నారా పరిశీలిస్తారు. సరిగ్గా చేస్తేనే లైసెన్స్ జారీ చేస్తారు.

– నంగునూరి సాయి రతన్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, సిటీ బ్యాంక్, డల్లాస్

అమెరికాకు వెళ్లే ముందు..



మాది కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మక్తపల్లి. 2011లో ఉద్యోగరీత్యా అమెరికా వచ్చా. అమెరికాకు వచ్చే ముందు తిమ్మాపూర్‌లోని రవాణా కార్యాలయంలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న. ఐదేళ్ల వ్యాలిడిటీ ఇచ్చారు. తర్వాత అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందా. మూడేళ్లకోసారి వీసాకాలం ముగిసేసరికి రెన్యూవల్ చేయించుకుంటున్న. ఇండియాలో కుడివైపు డ్రైవింగ్ స్టీరింగ్ ఉంటే అమెరికాలో ఎడమ వైపు ఉంటుంది. అందుకే ఇక్కడ లైసెన్స్‌కు ప్రాధాన్యత ఉంది.

– చింతం నరేందర్, అమెరికా

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కుడి, ఎడమైతే పొరపాటు లేదోయ్..ఓడిపోలేదోయ్ అన్నాడో సినీ కవి. కానీ...అంతర్జాతీయ డ్రైవింగ్ విషయంలో అలాకాదు.. కుడి ఎడమైనా.. ఎడమ కుడి అయినా.. ప్రమాదాలు జరుగుతాయ్..ప్రాణాలు పోతాయ్.. అంటున్నారు రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు. తాజాగా ఒడిశాలోని రైలు ప్రమాదం కూడా ఇదేవిధంగా ఒక ట్రాక్‌లో వెళ్లాల్సిన రైలు మరో ట్రాకుపై వెళ్లడంతోనే జరిగిందని ప్రచారం జరుగుతున్న వేళ.. ఒక దిశలో వెళ్లాల్సిన వాహనం మరో దిశలో పొరపాటునో, గ్రహపాటునో వెళ్తే ఎంతటి భారీ ప్రమాదం జరుగుతుంది? ఎన్ని ప్రాణాలు గాలిలో కలుస్తాయో చెప్పకనే చెప్పింది. కొన్నేళ్లుగా ఉద్యోగాల కోసం హైదరాబాద్, పలు జిల్లాల నుంచి ఐటీ నిపుణులు, ఉన్నత విద్య కోసం విద్యార్థులు విదేశాల బాట పడుతున్నారు. అగ్రరాజ్యాలు కాబట్టి అక్కడ వ్యక్తిగత వాహనాల వినియోగం అధికం. అక్కడ డ్రైవింగ్ చేసేందుకు వీలుగా మనవాళ్లు ఇక్కడే అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలి. కాబట్టి, విదేశాలకు వెళ్లే వారంతా అక్కడ డ్రైవింగ్ చేసేందుకు వీలుగా అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు తీసుకుంటున్నారు. కొన్నేళ్లుగా వీటికి డిమాండ్ పెరిగింది. ఈనేపథ్యంలో రోడ్డు నిబంధనలు కూడా ముఖ్యమే అన్న సంగతి చాలామంది మరిచిపోతున్నారు. దీంతో విదేశాల్లో డ్రైవింగ్ చేసే సమయంలో చిన్న పొరపాటు చేసినా దిద్దుకోలేని తప్పుగా మారే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముందు సాధన చేయాలి



విదేశాలకు వెళ్లిన ప్రతీ భారతీయుడికి మొదట్లో ఎదురయ్యే సమస్యే ఇది. చూసేందుకు చిన్నదిగా కనిపించినా క్షణాల్లో భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదం అధికం. ముందుగా అక్కడి రోడ్డు నిబంధనలు అలవాటు అయ్యే వరకు అక్కడ వాహనాలపై సాధన చేయాలి. అక్కడి రోడ్డు నిబంధనలపై పట్టు వచ్చాకే డ్రైవింగ్ చేయాలి.

– పుప్పాల శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్, ఆర్టీఏ

జత చేయాల్సిన పత్రాలు

ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, వెళ్లాలనుకునే దేశం జారీచేసిన వీసా(తప్పనిసరి కాదు), రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఫారం–1ఎ పత్రాలు, రూ.1700 ఆన్‌లైన్‌లో చెల్లించిన రసీదు

ఏడాది వ్యవధిలో జారీ అయిన లైసెన్స్‌లు

2022 మేలో 34, జూన్‌లో 70, జూలైలో 142, ఆగస్టులో 167, సెప్టెంబర్‌లో 92, అక్టోబర్‌లో 42, నవంబర్‌లో 44, డిసెంబర్‌లో 160, ఈ ఏడాది జనవరిలో 84, ఫిబ్రవరిలో 48, మార్చిలో 32, ఏప్రిల్‌లో 59, మేలో 77 లైసెన్స్‌లు జారీ అయ్యాయి.

ఏంటి సమస్య?



సాధారణంగా ఇండియా రోడ్డు నిబంధనల ప్రకారం రోడ్డుకు ఎడమ వైపు వాహనాలు ప్రయాణిస్తాయి. అందుకే మనం 'ఆల్వేస్ కీప్ లెఫ్ట్'' అన్న సూచికలు పెడుతుంటాం. రోడ్డు భద్రత విద్యలో భాగంగా పాఠ్యపుస్తకాల్లోనూ ఎడమవైపు వెళ్లాలనే చదువుకున్నాం. ఇక్కడ పుట్టి పెరిగిన వారంతా వాహనాలను ఎడమ వైపు నడుపుతారు. ఇండియాలో పుట్టి పెరిగిన కొందరు విదేశాల్లో కొన్నిరోజులు ఉండాల్సి వచ్చినప్పుడు డ్రైవింగ్ అనివార్యమవుతుంది. పైగా మనకు అక్కడి పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అక్కడ రహదారులు 120, 150 కిమీల వేగానికి అనుగుణంగా రూపొందించి ఉంటాయి. అక్కడ డ్రైవింగ్ చేసే సమయంలో పొరపాటున ఎడమవైపు వెళ్లారో ఇక అంతే.. భారీ విషాదానికి మీరే బాధ్యులుగా మిగిలిపోతారు. ఇక రెండో రకం సమస్య ఏంటంటే.. ఇండియాలో పుట్టి పెరిగి విదేశాల్లో స్థిరపడ్డ వారిలో కొందరు సెలవులకు ఇండియాకు వచ్చిన సమయంలో పొరపాటున కుడి వైపునకు వాహనాలను జోరుగా దూకిస్తారు. ఫలితంగా జరగరాని అనర్థాలు క్షణాల్లో జరిగిపోతాయి. ఏ దేశానికి వెళ్లినా ముందుగా అక్కడ రోడ్డు నిబంధనల ప్రకారం సాధన చేయాలి. డ్రైవింగ్ వచ్చు కదా అని తొందరపడితే భారీ మూల్యం చెల్లించకతప్పదని ఆర్టీఏ అధికారులు హెచ్చరిస్తున్నారు.

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఎందుకు?

విదేశాల్లో విద్య, ఉపాధి కోసం వలస వెళ్లే వారికి ఈరోజుల్లో అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. వీటిని దేశంలో ఎక్కడైనా తీసుకోవచ్చు. ఈ డ్రైవింగ్ లైసెన్స్‌ను చూపించి ప్రపంచంలో ఎక్కడైనా దాదాపు ఏడాదికాలం అక్కడి రోడ్డు నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేసుకునే వీలు కలుగుతుంది. అన్ని దేశాల్లో వెంటనే వాహనం తీసేందుకు అంగీకరించరు. కొందరు ముందుగా స్థానికంగా తమ రోడ్లపై నడపగలరు అని నిరూపించుకునేందుకు కొన్ని పరీక్షలు పాసవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాతే డ్రైవింగ్‌కు అనుమతిస్తారు. ఏడాదిపాటు వ్యాలిడిటీ ఉండే ఈ లైసెన్స్‌ను కాల పరిమితి ఆధారంగా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు పరివాహన్.గవ్.ఇన్ (https://www. parivahan.gov.in) హెచ్‌టీటీపీఎస్: //డబ్లూడబ్లూడబ్లూ.పీఏఆర్ఐవీఏహెచ్ఏఎన్.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ఆర్టీఏ కార్యాలయంలో పలు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

ప్రజలకు సేవలందించడం ఉద్యోగుల బాధ్యత

- కలెక్టర్ సంగీత
- కలెక్టరేట్‌లో సుపరిపాలన దినోత్సవం



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: ప్రజలకు సేవలందించడమే తమ బాధ్యత అని ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి గుర్తుంచుకోవాలని కలెక్టర్ సంగీత అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సుపరిపాలన దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తర్వాత పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, మండలాలు, పంచాయతీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల ఫలాలను అర్హులైన వారందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలను అందుబాటులోకి తెచ్చేందుకే పలు శాఖలను పునర్‌వ్యవస్థీకరించారని వివరించారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఈ–గవర్నెన్స్‌తో ప్రజలకు సేవలందించడం మరింత సులువుగా మారిందన్నారు. ప్రజలు కూడా తమ ఇళ్ల నుంచే వారి సమస్యలను ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు అవకాశమేర్పడిందని తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులు ఏ స్టేజీలో ఉన్నాయో కూడా తెలుసుకునే వీలుందన్నారు. రైతులు పండిస్తున్న పంటను క్రాప్‌బుకింగ్ ఆన్‌లైన్‌లో చేస్తున్నామని, ధరణి స్లాట్ బుక్ చేసుకున్న కొద్ది సమయంలోనే రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని తెలిపారు. భవనాల నిర్మాణానికి, పరిశ్రమల స్థాపనకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వివిధ శాఖల సమన్వయంతో అనుమతులు ఇస్తున్నామన్నారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పనుల నిమిత్తం ఆఫీసులకు వచ్చే ప్రజలకు సత్వర సేవలందిస్తేనే మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారి, పేదల సమస్యలు పరిష్కరించాలని, తిరస్కరించాల్సి వస్తే అందుకు గల కారణాలను వివరించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలన్నీ అరచేతి, వేళ్ల మాదిరిగా సమష్టిగా పనిచేసి సత్ఫలితాలను సాధించాలని ఓ కథను వినిపించారు. స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ వివరించారు. డీసీపీ వైభవ్‌గైక్వాడ్, డీఆర్‌డీఓ శ్రీధర్, డీపీవో చంద్రమౌళి, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సింహాచారి, డీఏవో ఆదిరెడ్డి, డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్ జిల్లా అధికారులు, ఎంపీడీవో, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఏమ్మా.. భోజనం బాగుంటుందా..

- కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి
- బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం



హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న వెంకటేశం

పెద్దపల్లిరూరల్: ఏమ్మా.. హాస్టల్ లో ఏమైనా ఇబ్బందులున్నాయా.. భోజనం బాగుంటుందా.. అని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలోని బాలికల కాలేజీ హాస్టల్ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. శనివారం ఆకస్మికంగా హాస్టల్‌ను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఉన్నతంగా ఎదగాలనే ఆలోచనతో లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. అనంతరం సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిలోని గురుకులాన్ని సందర్శించారు. అప్పటికే ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం వచ్చిన విద్యార్థులు, పేరెంట్స్‌తో మాట్లాడారు. ఇంటర్ అడ్మిషన్లపై ప్రిన్సిపల్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రూ.లక్ష సాయం పథకాన్ని అమలు చేస్తోందని దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులతో వచ్చిన పేరేంట్స్‌కు సూచించారు. ఆయన వెంట జిల్లా సంక్షేమ అధికారి రంగారెడ్డి, సహాయఅధికారి వినోద్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు రమేశ్, సరిత తదితరులున్నారు.

‘లక్ష సాయం’ ఎందరికో..?

- కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం బారులు
- తహసీల్దార్ ఆఫీసుకు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు
- మీ సేవ కేంద్రాల వద్ద నిరీక్షణ



తహసీల్దార్ ఆఫీసు బయటే నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సాయం ఎందరికందుతుందో ఏమో కానీ ఇప్పుడైతే దరఖాస్తుదారుల జేబు నుంచి సర్టిఫికెట్లు, జిరాక్సుల కోసం చేతిచమురు వదులుతోంది. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందాలనే ఆలోచనతో ఉన్న వారి అవసరాన్ని ఆసరాగా తీసుకున్న కొందరు దళారులు సర్టిఫికెట్లు ఇప్పిస్తామంటూ వసూళ్లకు దిగుతున్నట్లు సమాచారం. చేతి, కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న బీసీలలోని 15 కులాలకు తొలివిడతలో అవకాశం కల్పించింది. ఆయా కులాలకు చెందిన వారు కుల ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ ఆఫీసుల ఎదుట బారులు దీరుతున్నారు.

కిటకిటలాడుతున్న మీ సేవ కేంద్రాలు

ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రూ.లక్ష సాయం పథకం కింద ముందుగా దరఖాస్తు చేసుకుంటే మనకే వస్తుందంటూ కొందరు ప్రచారం చేయడంతో ఆశావహులంతా ఒక్కసారిగా దరఖాస్తు చేసుకునేందుకు ముందుకొచ్చారు. దీంతో రెండు రోజులుగా మీసేవ కేంద్రాలన్నీ కిటకిటలాడాయి.

కుప్పలు, తెప్పలుగా దరఖాస్తులు

మీసేవ కేంద్రాల్లో నమోదు చేసిన దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయానికి కుప్పలు, తెప్పలుగా చేరుతున్నాయి. ఒక్క పెద్దపల్లి పట్టణంలోనే రోజుకు 600 నుంచి వెయ్యి వరకు దరఖాస్తులు అందినట్లు తెలుస్తోంది. తహసీల్దార్ ఆఫీసుకు చేరిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రూ.45 కు బదులు రూ.100వసూలు

పల్లె ప్రాంతాలనుంచి వస్తున్న నిరక్షరాస్యుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని మీసేవ కేంద్రాల నిర్వాహకులు కొందరు ఒక్కో సర్టిఫికెట్ నమోదుకు రూ.45 తీసుకోవాల్సి ఉండగా.. రూ.100 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. పాత సర్టిఫికెట్ లేని వారి నుంచి ఇంకా ఎక్కువ మొత్తంలోనే తీసుకుంటున్నట్లు సమాచారం. నిర్వాహకులు అడిగినంత ఇవ్వకపోతే సర్టిఫికెట్ సకాలంలో రాదన్న భయంతో అడిగినంత చెల్లించుకుంటున్నట్లు తెలిసింది.

సర్టిఫికెట్లను అందిస్తాం



మీసేవా కేంద్రాల్లో నమోదు చేసిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలించి సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకున్నాం. సోమవారం నుంచి తమ సిబ్బందికి ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించాం. సకాలంలోనే సర్టిఫికెట్లు అందిస్తాం.

–వెంకటలక్ష్మి, తహసీల్దార్, పెద్దపల్లి

ఈనెల 20 ఆఖరు తేదీ

రూ.లక్ష సాయం పథకం కోసం బీసీ సంక్షేమ శాఖ ప్రకటించిన 15 కులాలకు తొలివిడతలో అవకాశం కల్పించింది. దరఖాస్తులను సమర్పించేందుకు ఈనెల 20 తేదీ ఆఖరు గడువుగా ప్రకటించింది. అందులో సగర ఉప్పర, నాయీబ్రాహ్మణ, రజక, కుమ్మరి శాలివాహన, అవుసుల, కంసాలి, వడ్రంగి శిల్పులు, వడ్డెర, కమ్మరి, కంచరి, మేదర, కృష్ణబలిజపూస, మేర టైలర్స్, ఆరెకటిక, ఎంబీసీ కులాల వారికి తొలివిడతలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

జాప్యం లేకుండా జారీ చేయాలి



మా ఊళ్లో ఉప్పర సగర కులస్తులే ఎక్కువ మంది కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేశారు. ఆ సర్టిఫికెట్లను జాప్యం లేకుండా జారీ చేయాలి. రూ.లక్ష సాయం పథకం కోసం లబ్ధిదారులు సర్టిఫికెట్ల కోసం ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టి సకాలంలో అందించాలి. – తాడిచెట్టి శ్రీకాంత్, రాఘవాపూర్, సగరసంఘ నాయకుడు

ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి



ప్రభుత్వ పథకం ఫలాలను పొందేందుకు కుల, ఆదాయ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. వీలైతే పది గ్రామాలకో కౌంటర్ ఏర్పాటు చేసి సర్టిఫికె జారీలో ఇబ్బందులు లేకుండా చూడాలి.

– నోముూరి శ్రీధర్‌రావు, బీసీ యువజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు





తెగిపడిన విద్యుత్ తీగె



రామగుండం రైల్వేస్టేషన్‌లో రేకుల పైనుంచి వరద నీటి దుస్థితి, కూలిన వృక్షాలు

ఈదురు గాలులు.. భారీవర్షం

జ్యోతినగర్/రామగుండం: ఎన్టీపీసీ, రామగుండం ప్రాంతంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు రహదారులు వరద నీటితో ముంచెత్తాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మేవా కేంద్రం ఎదురుగా ఉన్న దుకాణ సముదాయం వద్ద విద్యుత్ తీగె తెగిపడింది. తీగె పడిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. రామగుండం కార్పొరేషన్ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డులోని వీధి విక్రయదారుల గుడారాలు కూలి ఆర్థికంగా నష్టపోయారు. రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం నేల కొరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. రామగుండం రైల్వేస్టేషన్‌లోని 1, 2 ప్లాట్‌ఫారాలపై రేకుల పైకప్పు నుంచి నీరు పడటంతో ఎత్తిపోతలను తలపించింది.

12న తెలంగాణ రన్

గోదావరిఖని: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12న తెలంగాణ రన్ నిర్వహిస్తున్నట్లు డీసీపీ వైభవ్‌గైక్వాడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్, క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 5.30 గంటలకు గోదావరిఖనిలోని మున్సిపల్ చౌరస్తా జంక్షన్ నుంచి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ మీదుగా గాంధీ చౌరస్తా వరకు తెలంగాణ రన్ కొనసాగుతుందన్నారు. పాల్గొనే వారు పాల్గొనాలనుకునే వారు తమ వివరాలను గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. షూస్ వేసుకుని ఉదయం 6:00 గంటలకు గోదావరిఖనిలోని మున్సిపల్ చౌరస్తా వద్దకు చేరుకుని రిపోర్ట్ చేయాలన్నారు. వేడుకల్లో కార్పొరేటర్లు, బార్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు, మీడియా మిత్రులు, యువత, వాకర్స్, విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

ఆయన నేత్రాలు సజీవం


పెద్ద రాజయ్య (ఫైల్)

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 14వ డివిజన్ ఎల్కలపల్లిగేట్‌కు చెందిన కన్నూరి పెద్ద రాజయ్య(80) అనారోగ్య కారణాలతో శుక్రవారం రాత్రి ఇంట్లోనే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి, కుమారుడు-కోడలు శంకర్-భాగ్యలక్ష్మి, ఇతర కుటుంబసభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి బూర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ శనివారం రాజయ్య నేత్రాలను సేకరించారు. వాటిని హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు పంపించారు. నేత్రదాత కుటుంబసభ్యులను ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, లయన్స్ క్లబ్ ప్రతినిధి బెజిగోపాల్ త్రివేది తదితరులు అభినందించారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

రామగుండం: సికింద్రాబాద్ నుంచి సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్, ఇంటర్ సిటీ, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు శనివారం గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. కాగజ్‌నగర్ వైపు వెళ్లే ఇంటర్‌సిటీ రైలు రామగుండంకు ఉదయం 9.30 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 2 గంటలకు, తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం ఒంటి గంటకు రావాల్సి ఉండగా సాయంత్రం 4.30 గంటలకు రావడంతో సికింద్రాబాద్ వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు భారీ వర్షంతో ప్లాట్‌ఫాంపై నిలబడలేని పరిస్థితి, నీరు పైనుంచి పడుతుండటం, ఆన్‌లైన్‌లో రైల్వే స్టేటస్ సరిగా చూపించకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇటీవలి కాలంలో భాగ్యనగర్, కాగజ్‌నగర్, కరీంనగర్ నుంచి వచ్చే పుష్‌పుల్ ప్యాసింజర్ రైళ్లు చాలా ఆలస్యంగా నడుస్తున్నాయి. రైల్వే అధికారులు స్పందించి, సాధారణ ప్రజలు ఎక్కువగా ప్రయాణించే రైళ్ల రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

బరువుకు భయపడరు | సమయం చూడరు

- బిహార్ కూలీల ప్రత్యేకత
- జిల్లాలోని 141 రైస్‌మిల్లుల్లో హమాలీలుగా 1,670 మంది
- ఒక్కోదానిలో 15 నుంచి 30 మందికి పని
- ఏడాదిలో 8 నెలలు ఇక్కడే..
- వారు లేకుంటే ఇబ్బందే అంటున్న యజమానులు


సుల్తానాబాద్ రైస్ మిల్లులో ధాన్యం బస్తాలు మోస్తున్న బిహార్ కూలీలు

సుల్తానాబాద్(పెద్దపల్లి): బిహార్ రాష్ట్రం నుంచి ఉపాధి వెతుక్కుంటూ వచ్చిన వలస కూలీలు వారు.. అవసరమైతే విరామమెరుగక పని చేస్తారు.. మోసే బరువుకు భయపడరు.. చెమట చిందిస్తూ నిరంతరం శ్రమిస్తుంటారు.. స్థానిక కూలీలు ముందుకు రాకపోవడంతో ఇప్పుడు పెద్దపల్లి జిల్లాలోని రైస్‌మిల్లుల యజమానులు బిహార్ హమాలీలతో పనులు చేయించుకుంటున్నారు.

సుల్తానాబాద్‌లోనే 121 మిల్లులు..

జిల్లాలో అత్యధిక రైస్‌మిల్లులు ఉన్న ప్రాంతం సుల్తానాబాద్. స్థానికంగా కార్మికులు సక్రమంగా పని చేయకపోవడం వల్ల యజమానులు బిహార్ నుంచి కార్మికులను తీసుకువస్తున్నారు. సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని, కమాన్‌పూర్, గోదావరిఖని ప్రాంతాల్లో 141 మిల్లులున్నాయి. వీటిలో అత్యధికంగా సుల్తానాబాద్‌లో 121 ఉన్నాయి. దీంతో వలస కూలీలు చాలామంది ఇక్కడికి వచ్చి, జీవనోపాధి పొందుతున్నారు. బాయిల్డ్ రైస్‌మిల్లుల్లో ఎక్కువ మంది అవసరమవుతారు. ఒక్కో మిల్లులో 15 నుంచి 30 మంది హమాలీలుగా కొనసాగుతున్నారు. సమయం, షిఫ్టు పద్ధతి లేకుండా పనులకు హాజరవుతున్నారు. ఒక్కొక్కరు రోజుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు కూలి పొందుతున్నారు. పని లేకుంటే రోజుకు రూ.300 నుంచి రూ.500 వస్తాయి.

ఎక్కువ మంది యువకులే..

వలస కూలీల్లో ఎక్కువ మంది యువకులే. భార్యాపిల్లలను సొంత గ్రామాల్లో వదిలేసి, ఉపాధి వెతుక్కుంటూ వచ్చారు. బిహార్ రాష్ట్రంలోని మోతీహార్ జిల్లా కంగారియా గ్రామానికి చెందిన పలువురు సుల్తానాబాద్‌తో పాటు చుట్టుపక్కల మిల్లుల్లో హమాలీలుగా పని చేస్తున్నారు. కూలి డబ్బును గూగుల్ పే, ఫోన్ పే ద్వారా కుటుంబసభ్యులకు పంపుతున్నారు. 5గురు చొప్పున తమ స్వగ్రామానికి వెళ్లి, రెండు, మూడు నెలలు అక్కడ ఉండి తర్వాత తిరిగి వస్తారు.

స్థానిక కూలీలు రావడం లేదు

రైస్‌మిల్లుల్లో ధాన్యం, బియ్యం బస్తాలు మోయాల్సి ఉంటుంది. బరువు పనులు చేసేందుకు స్థానిక కూలీలు రావడం లేదు. బిహార్ కూలీలు ఈ తరహా పనులను సులువుగా చేసేస్తున్నారు. వారు లేకుంటే ఇబ్బందికర పరిస్థితులుంటాయని మిల్లుల యజమానులు చెబుతున్నారు. వారికి తాము అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, యోగక్షేమాలు చూస్తున్నామని అంటున్నారు.

రైస్‌మిల్లు వద్దే వసతి..

వలస కూలీల కోసం యజమానులు తమ మిల్లుల ఆవరణలోనే షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిలోనే వంట, వసతి ఉండేలా చూస్తున్నారు. జిల్లాలోని రైస్‌మిల్లులు సహా గ్రానైట్ ఫ్యాక్టరీలు, శీతల గిడ్డంగులు, అసంఘటిత రంగంలో పనిచేసే వలస కూలీల వివరాలు అధికారికంగా ఎక్కడా లేవు.

మా రాష్ట్రంలో పనులు తక్కువ



మా రాష్ట్రంలో కూలీ పనులు తక్కువ ఉంటాయి. ఏడాదిలో రెండు, మూడు నెలలు ఉపాధి లభిస్తుంది. ఇక్కడ రోజుకు రూ.600 నుంచి రూ.800 వరకు ఇస్తారు. వారం వారం ఇంటికి డబ్బులు పంపిస్తా. మా గ్రామానికి చెందిన 15 నుంచి 30 మందిమి ఏటా వస్తాం.

– కిశోర్, హమాలీ పెద్దమనిషి, కంగారియా గ్రామం, బిహార్

వేర్వేరు ప్రాంతాల్లో మావాళ్లు



వానాకాలం, వేసవికాలం కలిపి 8 నెలలు ఉపాధి దొరుకుతుంది. ఆ సమయంలో ఇక్కడే ఉంటాం. మిగతా నాలుగు నెలలూ ఇక్కడే ఉండాలని యజమాని చెబుతారు. కానీ భార్యాపిల్లలను చూడాలని వెళ్తాం. తెలంగాణలోని వేర్వేరు ప్రాంతాల్లో మావాళ్లు పని చేస్తున్నారు.

– మంటూ చౌదరి, కంగారియా గ్రామం, బిహార్

బొగ్గుబాయి వార్తలు

క్రీడాకారుల సంక్షేమానికి సింగరేణి కృషి

- ఆర్జీ–3 జీఎం మనోహర్
- రాణీ రుద్రమదేవి క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ కోర్టు ప్రారంభం


బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

కమాన్‌పూర్(మంథని): క్రీడాకారుల సంక్షేమానికి సింగరేణి సంస్థ కృషి చేస్తోందని, వారికోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని ఆర్జీ–3 జీఎం మనోహర్ అన్నారు. సెంటినరీకాలనీ రాణీ రుద్రమదేవి క్రీడా మైదానంలో రూ.8 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్ కోర్టును శనివారం ఆయన ప్రారంభించారు. కాసేపు బాస్కెట్‌బాల్ ఆడారు. సింగరేణిలో విధులు నిర్వహిస్తూ వివిధ క్రీడాంశాల్లో రాణిస్తున్న వారి సంక్షేమం కోసం నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సంస్థ తరఫున అనేక మంది క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయిలో జరిగే పలు పోటీల్లో పాల్గొని, పతకాలు సాధించారని అన్నారు. క్రీడా మైదానాలను కార్మికులతోపాటు వారి పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారుల సంఘం ప్రతినిధి వెంకటేశ్వర్లు, సివిల్ డీజీఎం పద్మరాజు, ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ, డీవైపీఎం రవీందర్‌రెడ్డి, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సివిల్ పనులు త్వరగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): సివిల్ విభాగం పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ ఆదేశించారు. శనివారం అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పెండింగ్ పనులను సివిల్ అధికారులు ఆయనకు వివరించారు. బేస్ వర్క్‌షాప్‌లో అన్ని సెక్షన్ల షెడ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని జీఎం అన్నారు. కృషిభవన్ వద్ద యంత్రాల మరమతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. ఉద్యోగులకు సంబంధించిన రెస్ట్ షెల్టర్లు, వాహనాల పార్కింగ్ షెడ్లు త్వరితగతిన నిర్మించాలన్నారు. సమావేశంలో ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, ప్రాజెక్టు ఇంజినీర్ దుర్గాప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ్, స్టోర్స్ డీజీఎం సుజన్‌మెహ్రా, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ, బేస్ వర్క్‌షాప్ ఇన్‌చార్జి రామకృష్ణ పాల్గొన్నారు.

కేసీఆర్ మాటలు ఎవరూ నమ్మరు

- సింగరేణి ప్రైవేటీకరణకు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలుపలేదా?
- ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి జనక్‌ప్రసాద్


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): కేసీఆర్ చెప్పే మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి జనక్‌ప్రసాద్ అన్నారు. శనివారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులపై కేసీఆర్ కపట ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటులో సింగరేణి ప్రైవేటీకరణకు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు తెలిపిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణిలో కొత్త ఉద్యోగాలు వచ్చాయని చెబుతున్న కేసీఆర్ తెలంగాణ రాక ముందు 70 వేల మంది ఉద్యోగులు ఉంటే ఇప్పుడు వారి సంఖ్య 43 వేలకు ఎలా తగ్గిందన్నారు. గతంలో శ్రీరాంపూర్ సభ సాక్షిగా ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. సింగరేణి కార్మికుల సొంతింటి కల ఇంకా నెరవేరలేదని, కాంట్రాక్టు కార్మికుల హైపవర్ కమిటీ వేతనాల ఊసే లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల మార్పు, డిపెండెంట్ల వయోపరిమితి 35 నుంచి 40 ఏళ్లకు పెంపు వంటి అంశాలపై ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిలు ఇవ్వకుండా కార్మికులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, సెంట్రల్ సెక్రటరీలు ఎట్టం కృష్ణ, బత్తుల పోచయ్య, నాయకులు వడ్డేపల్లి దాస్, అక్బర్ అలీ, భూమయ్య, మార్కండేయ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులపై ఎన్టీపీసీ నిర్లక్ష్యం'

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను శ్రమదోపిడీ చేస్తూ కొత్త వేతన ఒప్పందం అమలులో జాప్యం చేస్తోందని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు ఆరోపించారు. శనివారం ప్రాజెక్టు లేబర్ గేట్ సమీపంలోని రాజీవ్ రహదారిపై ధర్నా చేపట్టి, మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లపై యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. సంస్థలో 35 ఏళ్లుగా విద్యుదుత్పత్తి కోసం పని చేస్తున్న 3,500 మందికి పైగా కార్మికులు అనేక రికార్డు జనరేషన్ అవార్డులు సాధించడంలో, మహారత్న కంపెనీగా అవతరించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. నేడు వారి కుటుంబాలు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలు గడుపుతున్నాయని, వెంటనే యాజమాన్యం కార్మిక సంఘాలతో చర్చించి, ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే సోమవారం ఉదయం మొదటి షిఫ్టు నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. ఫోరం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'ధరణి పోర్టల్‌తో భూస్వాములకే లబ్ధి'


వివరాలు తెలుసుకుంటున్న అడ్వకేట్ సాధిక్ అలీ

ఎలిగేడు(పెద్దపల్లి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ భూస్వాములకే లబ్ధి చేకూర్చుతుందని, పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదని సాధిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు అడ్వకేట్ సాధిక్ అలీ అన్నారు. శనివారం ఎలిగేడు మండలంలోని శివపల్లిలో రైతులతో మాట్లాడి, ధరణి సమస్యలపై వివరాలు సేకరించారు. ఈ పోర్టల్‌లో ఉన్న ఇబ్బందులను ప్రజలకు తెలియజేసి, వారిలో చైతన్యం తీసుకురావడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పాదయాత్ర చేశామన్నారు. ధరణిలో కాస్తు కాలం లేకపోవడంతో ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన పేదల భూములు తిరిగి పట్టాదారుల కాలంలో ఉన్న భూస్వామలకే సొంతమవుతున్నాయని ఆరోపించారు. ధరణి అంటే రైతుబంధు, రైతుబీమా వస్తుందని ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. శివపల్లిలో 121 సర్వే నంబర్‌లోని భూమిని కొంతమంది పేదలు కొనుగోలు చేశారని తెలిపారు. కానీ రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడంతో సదరు భూమి పట్టాదారు పేరిటే ధరణిలో వస్తోందన్నారు. ఇప్పుడు కొనుగోలు చేసినవారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. 58, 59 జీవో కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గజానికి రూ.1,100 చెల్లించాలని అధికారులు భయపెడుతున్నారని, నిరుపేదలు ఎలా చెల్లిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల్ని పేదల నుంచి లాక్కోవడానికి సర్కారు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సుంకనపల్లి లక్ష్మణ్, కాంపెల్లి బాబు, పొన్నాల మల్లయ్య, నర్సయ్య, పొన్నాల లచ్చయ్య, అంజయ్య, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ?

- చెల్లాచెదురుగా పడిన కోడిగుడ్లు, ఇతర సరుకులు
- కోతిపిల్ల ధ్వంసం చేసిందంటున్న టీచర్


పగిలిన కోడిగుడ్లు, కింద పడిన పప్పు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగినట్లు స్థానికంగా ప్రచారం జరిగింది. గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు అందించాల్సిన సరుకులు కేంద్రంలో చిందరవందరగా పడి ఉండటం చర్చనీయాంశంగా మారింది. శనివారం ఉదయం చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేసరికి లోపల కోడిగుడ్లు పగిలిపోయి, పప్పు నేల మీద పారబోసి ఉన్నాయి. మరికొన్ని సరుకులు ఎత్తుకెళ్లినట్లుగా తెలుస్తోంది. అయితే కిటికీలో నుంచి కోతిపిల్ల చొరబడి, సరుకులను నాశనం చేసిందని అంగన్‌వాడీ టీచర్ చెబుతున్నారు. మూసి ఉన్న గదిలోనికి కోతిపిల్ల చొరబడటం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే సెంటర్ పరిధిలోని లబ్ధిదారులకు అందాల్సిన సరుకులు అందకుండా పోయాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తప్పిన భారీ అగ్ని ప్రమాదం

- ఇంధన రైలు రావడంతో టెన్షన్
- మంటలు ఆర్పడంతో ఊపిరి పీల్చుకున్న రైల్వే అధికారులు


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దపల్లిరూరల్: రాఘవాపూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ రైతు శనివారం తన పొలంలో వరి కొయ్యకాళ్లకు నిప్పంటించాడు.. దీనికి గాలి తోడవడంతో ఆ మంటలు రైల్వేస్టేషన్ వైపు వ్యాపించాయి. ఇది గమనించిన స్టేషన్ మాస్టర్ రవి వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ తన సిబ్బందితో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలు వ్యాపిస్తున్నప్పుడే ఇంధనంతో వెళ్తున్న రైలు రాఘవాపూర్ స్టేషన్‌కు చేరడంతో రైల్వే అధికారుల్లో ఆందోళన మొదలైంది. వారితోపాటు ఆర్‌పీఎఫ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైల్వే సిగ్నల్‌కు సంబంధించిన కేబుల్‌కు నిప్పంటుకుంటే ఆ ప్రభావం రైళ్ల రాకపోకలపై పడుతుందని భయపడ్డారు. కానీ సకాలంలో మంటలు ఆర్పడంతో భారీ ప్రమాదం తప్పిందన్నారు. అగ్నిమాపక అధికారి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అందుబాటులో ఆర్అండ్‌బీ సేవలు


ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఈ రాములు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రజలకు అందుబాటులో సుపరిపాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తోందని ఆర్అండ్‌బీ డీఈ రాములు అన్నారు. శనివారం సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన రోడ్లు భవనాల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇందులో సుల్తానాబాద్ సెక్షన్–1, సెక్షన్–2తో పాటు కాల్వశ్రీరాంపూర్ సెక్షన్ కార్యాలయాలు ఉంటాయని తెలిపారు. త్వరలో జూలపల్లి, ముత్తారం సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు భవనాల శాఖకు అత్యధిక నిధులు కేటాయించి అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి నీరుకుల్ల రోడ్డు వరకు రూ.90 లక్షల వ్యయంతో నిర్మించే రోడ్డు టెండర్ పూర్తయిందని, రూ.2కోట్లతో సుల్తానాబాద్ నుంచి పూసాల చెరువు వరకు నిధులు మంజూరై టెండర్ పూర్తయిందని వివరించారు. వీటితో పాటు సుల్తానాబాద్ నుంచి నీరుకుల్ల వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు నదీమ్, రాజేందర్, కొమురయ్య, నాయకులు రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోండి


కక్షిదారుకు అవార్డు కాపీ అందిస్తున్న జడ్జి భారతి


మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాజీ మార్గమే రాజమార్గమని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి జీఎస్ఎల్.ప్రియాంక అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సు, లోక్ అదాలత్‌కు ఆమె హాజరై, మాట్లాడారు. సివిల్, క్రిమినల్ కేసులను కక్షిదారులు ఇరువర్గాల అంగీకారంతో లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకొని, ప్రశాంత జీవనాన్ని గడపాలని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూసారపు బాలకిషన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పెగడ శ్యాంసుందర్, ఏపీపీ శ్యాంప్రసాద్, ఏజీపీ మేకల తిరుపతిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు పబ్బతి లక్ష్మీకాంత రెడ్డి, జోగుల రమేశ్, భూమయ్య, శివ, లక్ష్మిరాజ్యం, శ్రీరాములు, పలువురు న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

272 కేసులు పరిష్కారం

మంథని: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 272 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి భారతి చట్టాలపై అవగాహన కల్పించారు. వివిధ కేసుల్లో రూ.26,43,700లను పరిహారం కింద చెల్లింపునకు ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ జడ్జి స్వాతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, న్యాయవాదులు, పోలీసులతోపాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.